

బదిలీలకు వేళాయె!
ఉపాధ్యాయ బదిలీలకు పాఠశాల విద్యాశాఖ సన్నాహాలు చేపట్టింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ సోమవారం వెలవడనున్నట్లు తెలిసింది. -8లో



యథేచ్ఛగా ప్రభుత్వ భూముల కబ్జా
కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పుల్లంపేట అడ్డగా మారింది. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని మొక్కలు నాటేశారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
39.8/28.0

వాతావరణం
జిల్లాలో ఆదివారం 28.0 - 39.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం



ధ్వజారోహణ నిర్వహిస్తున్న వేదపండితులు

జమ్మలమడుగు: నారాపురస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా టీటీడీ నారాపుర స్వామి ఆలయంలో ఆదివారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఆలయం ముందున్న ధ్వజ స్థంభానికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి ఊంజల్ సేవతో పాటు పెద్ద శేష వాహనంపై ఊరేగించారు.

గంగమ్మా..కరుణించమ్మా..



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లి: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీశ్రీ అనంతపురం గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. తలనీలాలు అర్పించారు. గంగమ్మా..వర్షాలు సకాలంతో కురిపించమ్మా...కరుణించి.. కాపాడు తల్లీ అంటూ వేడుకున్నారు. ఆలయ పూజారులు చెల్లు వంశీయులు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

నేటి నుంచి అన్నమాచార్యుడి జయంత్యుత్సవాలు



ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఆర్చి

రాజంపేట: పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు 617 జయంతి ఉత్సవాలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఇందుకోసం టీటీడీ తాళ్లపాక, 108 అన్నమయ్య అడుగుల విగ్రహం వద్ద ఏర్పాట్లను పూర్తిచేసింది. ఈనెల 18వరకు ఉత్సవాలు జరుగుతాయని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు అధికారులు తెలిపారు. తొలిరోజు గోష్ఠిగానంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. తాళ్లపాక ధ్యానమందిరం ఆవరణలో చలువపందిళ్లు ఏర్పాట్లు చేశారు.

లాహిరి..లాహిరి..లాహిరిలో..



దేవునికడప కోనేరులో స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం

పగలంతా భక్తుల మొరలు విని వారి సమస్యలను తీర్చి శ్రమించిన శ్రీ లక్ష్మి వెంకటేశ్వరుడు సాయంత్రం వాతావరణం చల్లబడ్డాక అలా అలా తెప్పపై జలవిహారం చేస్తూ సేద తీరాడు. దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక తెప్పోత్సవాలో భాగంగా రెండవరోజు ఆదివారం పుష్కరిణిలో తెప్పపై స్వామి, అమ్మవార్లు ఐదుమార్లు విహరించారు. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్ల మూలమూర్తులను పల్లకీపై కొలువుదీర్చి ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు చేర్చారు. అక్కడి అలంకార మండపంలో విశేష అభిషేకాలు, అలంకారం చేసి, మంగళ హారతులు ఇచ్చి పుష్కరిణిలో సిద్ధంగా ఉంచిన తెప్పపై కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు త్రివిక్రమ్, కృష్ణమోహన్ బృందం, ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో మంగళ హారతులు ఇచ్చి తెప్పను జల విహారం చేయించారు. భక్తులు ఒళ్లంతా కళ్లు చేసుకుని ఈ మనోహరమైన దృశ్యాన్ని తిలకించి పులకించిపోయారు. భక్తుల గోవిందనామ స్మరణలతో పుష్కరిణి పరిసరాలు మార్మోగాయి. ఈ ఉత్సవాలు రేపటితో ముగియనున్నాయి.
-కడప కల్చరల్



స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు

పల్లె వైద్యానికి చంద్రగ్రహణం

కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య రంగం కుదేలైంది. పేదలకు వైద్య సేవలు అందించే కీలకమైన ఒక్కో విభాగం విచ్ఛిన్నమవుతూ వస్తోంది. తాజాగా పల్లె వాసుల ఆరోగ్య పరిరక్షణలో కీలకమైన సీహెచ్‌ఓలు సమ్మె బాట పట్టడంతో పల్లె వైద్యం పడకేసింది. ఫలితంగా 'విలేజ్ హెల్త్ క్లినిక్' సంక్షోభంలో పడింది.

- సమ్మెలో 'సీహెచ్‌ఓ'లు..అందని వేతనం
- ఇప్పటికే 9 నెలలుగా అందని ఇన్సెంటివ్
- సంక్షోభంలో 'విలేజ్ హెల్త్ క్లినిక్'లు



సమ్మెలో భాగంగా ఆందోళన చేస్తున్న సీహెచ్‌ఓలు

కడప రూరల్: ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్య రంగం ఎంతో కీలకమైంది. ఇప్పుడు ఈ రంగానికి చెదలు పట్టింది. ఫలితంగా వైద్య రంగానికి సంబంధించిన అన్ని సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయి. అందులో భాగంగా క్షేత్ర స్థాయిలో గ్రామీణుల వైద్యానికి సంబంధించి కీలకంగా ఉన్న 'విలేజ్ హెల్త్ క్లినిక్'ల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

- నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా ఆరోగ్య అయుష్మాన్ మందిర్ కింద 2019 నుంచి ఎంఎల్‌పీహెచ్‌ల (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్) బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన అభ్యర్థులతో నియామకాలను చేపట్టారు. ప్రస్తుతం వీరిని సీహెచ్‌ఓ (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్)లుగా పిలుస్తున్నారు. వీరు గ్రామీణ ప్రాంతాల్లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రా (పీహెచ్‌సీ)ల పరిధిలో విధులను చేపడుతూ, స్థానికులకు వైద్య సేవలు అందిస్తున్నారు.



- కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామీణ వైద్యానికి గ్రహణం పట్టింది. సీహెచ్‌ఓలు తమ సమస్యలను పరిష్కరించాలని పాలకులకు విన్నవించారు. ఫలితం లేకపోవడంతో ఏప్రిల్ 28వ తేదీ నుంచి విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. సమ్మె బాట పట్టి రెండు వారాలు దాటినప్పటికీ ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదని సీహెచ్‌ఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'సీహెచ్‌ఓ'ల పరిస్థితి దయనీయం

అద్దె భవనాల్లో కొనసాగుతున్న క్లినిక్‌లకు ప్రభుత్వం పది నెలలుగా బాడుగలు..కరెంట్ బిల్లులను చెల్లించలేదు. ఒక క్లినిక్‌కు ఒక నెలకు రూ 1000 నుంచి రూ. 4 వేల వరకు బాడుగ, కరెంట్ బిల్లు రూ 300 నుంచి రూ.450 వరకు ఉంటుంది. ఈ బిల్లులను సీహెచ్‌ఓలే చెల్లించడం గమనార్హం. అలాగే ప్రభుత్వం సమ్మెలో ఉన్న సీహెచ్‌ఓలపై బెదిరింపులకు పాల్పడుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సమ్మెలో ఉన్న సిబ్బందికి ఏప్రిల్ నెల వేతనాలు మే నెలలో వేయలేదు. ఒకరికి ఒక నెల వేతనం రూ.25 వేల వరకు వస్తుంది. సమ్మెలో పాల్గొనని సిబ్బందికి దాదాపు 8-10 మందికి మాత్రమే 25 రోజులకు గాను రూ. 21 వేలు వేశారు. మిగతా వారికి ఒక్క పైసా కూడా జమ చేయకపోవడం గమనార్హం.

» గాడి తప్పిన వైద్యం
విలేజ్ క్లినిక్‌లో సీహెచ్‌ఓలు లేకపోవడంతో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం క్షేత్ర స్థాయిలో పనిచేసే ఏఎన్‌ఎం, ఆశాలు సీహెచ్‌ఓల పాత్రను పోషిస్తున్నారు. క్లినిక్‌కు వచ్చే పేషెంట్స్‌కు వారే మందులు ఇస్తున్నారు. జ్వరానికి, ఒళ్లు నొప్పులకు మందులు ఇవ్వొచ్చు. రోగ నివారణలో కీలకమైన 'యాంటిబయాటిక్' మాత్రలను ఇవ్వగలరా..? అనే ప్రశ్న వస్తోంది. అలాగే రోగ నిర్ధారణ పరీక్షలు ఎలా చేస్తారు... వ్యాధిని నిర్ధారిస్తే ఏ మందులు ఇస్తారు అనే సందేహాలు కలుగుతున్నా యి. చాలా ప్రాంతాల్లో ఏఎన్‌ఎం, ఆశాలు క్లినిక్‌ను తెరచి, వాటి ఫొటోలను డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన వాట్సాప్‌ల్లో పెట్టి, క్లినిక్‌లను మూసేసి క్షేత్ర స్థాయిలో తమ విధుల్లోకి వెళుతున్నట్లుగా సమాచారం. ఇలా అనేక కారణాలతో గ్రామీణ వైద్యం గాడి తప్పిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



విలేజ్ హెల్త్ క్లినిక్

» 'సీహెచ్‌ఓ'లకు నిబంధనల సంకెళ్లు
ఒక సీహెచ్‌ఓకు వేతనంతో సంబంధం లేకుండా సర్వీసు అంశాలకు సంబంధించి ఒక నెలకు ఇన్సెంటివ్ కింద రూ 15 వేలు అందుతుంది. ఈ ఇన్సెంటివ్ 9 నెలలుగా అందలేదు, తాజాగా ప్రభుత్వం 6 నెలల ఇన్సెంటివ్‌ను అందజేస్తామని ప్రకటించింది. ఆ ఇన్సెంటివ్‌ను ఎప్పుడు జమ చేసేది చెప్పలేదు. సీహెచ్‌ఓలు సమ్మెలో ఉండగా చెల్లిస్తారా..లేక సమ్మె విరమించిన తరువాత చెల్లిస్తారా అనే అంశంను తేల్చలేదు. ప్రభుత్వం 8వ తేదీన ఒక సర్క్యులర్ జారీ చేసింది. సీహెచ్‌ఓలు స్థానికంగా ఉండాలి. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు రాత్రి 8 గంటలకు ఎఫ్‌ఆర్‌సీ (అటెండెన్స్) వేయాలి. అలా చేయకపోతే ఇన్సెంటివ్‌లో రూ.5 వేలు కట్ చేస్తామని తెలపడం పట్ల సీహెచ్‌ఓలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రూ.15 వేలు ఇన్సెంటివ్ అనేది సర్వీసుకు సంబంధించిన అంశం. తమ సమస్యలను పరిష్కరించకపోగా ఈ కొత్త నిబంధనలు ఏమిటని సీహెచ్‌ఓలు ప్రశ్నిస్తున్నారు.

కొత్త నిబంధనలు సరికాదు
మా ప్రధాన సమస్య నిబంధనల ప్రకారం తక్షణం రెగ్యులర్ చేయాలి. అలాగే మాకు ప్రతి నెలా వచ్చే రూ.15 వేలు సర్వీస్‌కు సంబంధించిన ఇన్సెంటివ్. స్థానికంగా ఉండాలంటే రూ.15 వేలుతో సంబంధం లేకుండా అదనంగా రూ.5 వేలు చెల్లించాలి. క్లినిక్‌లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తాయి. ప్రభుత్వం ఉదయం 8 గంటలకు, సాయంత్రం 8 గంటలకు ఎఫ్‌ఆర్‌సీ వేయాలనడం తగదు. అధిక శాతం మహిళా ఉద్యోగులే ఉంటారు. ప్రభుత్వం, అధికారులు ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలి. ప్రభుత్వం మా సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలి.
– కే గిఫ్టీ షీలా, జిల్లా అధ్యక్షురాలు, ఏపీ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్/ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అసోసియేషన్

కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోండి
- డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

కడప సెవెన్‌రోడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు.

సభాభవన్‌లో పీజీఆర్‌ఎస్ నిర్వహణ

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్)ను ఈ సోమవారం సభాభవన్ లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్) వెబ్సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునన్నారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

డయల్ యువర్ కలెక్టర్

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు.

మద్యం దుకాణానికి దరఖాస్తుల ఆహ్వానం
కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని జమ్మలమడుగు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పెద్దముడియం మండలంలో గీత కులాలకు చెందిన మద్యం దుకాణానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రీడ్ విధానంలో ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు ఉంటుందని, 17న కొత్త కలెక్టరేట్‌లో డ్రా తీస్తామన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- ఏర్పాట్లను సిద్ధం చేసిన ఇంటర్ విద్యాశాఖ అధికారులు
- జిల్లావ్యాప్తంగా పరీక్షలు రాయనున్న 17408 మంది విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. జిల్లావ్యాప్తంగా ప్రథమ సంవత్సర విద్యార్థులకు 48 పరీక్షా కేంద్రాల్లో, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు 26 పరీక్షా కేంద్రాలలో నిర్వహించనున్నారు.



17,408 మంది విద్యార్థులు...

జిల్లావ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 17,408 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరానికి సంబంధించి 12,378 మంది జనరల్, 692 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. ఇక సెకండియర్ సంబంధించి 3899 మంది జనరల్, 439 మంది ఒకేషనల్ పరీక్షలను రాయనున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఇంప్రూవ్‌మెంట్ రాసే వారి సంఖ్య అధికంగా ఉండటంతో జనరల్ 12,378 మంది విద్యార్థులు ఉన్నారు. కాగా ప్రథమ సంవత్సర పరీక్షల నిర్వహణ కోసం 48 మంది డిపార్టుమెంట్, 48 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు. అలాగే ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 26 మంది డిపార్టుమెంట్ అధికారులు, 26 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు. వీరితోపాటు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను కూడా ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలు ఇప్పటికే జిల్లా కేంద్రానికి చేరుకోగా వాటిని ఆయా పోలీసు స్టేషన్లలో భద్రపరిచారు. పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పరీక్షలను పర్యవేక్షించనున్నారు.



పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్‌ఐఓ బండి వెంకటసుబ్బయ్య

రెండు సెషన్లలో...

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలలను రెండు సెషన్లలో నిర్వహించనున్నారు. ప్రథమ సంవత్సర పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు జరగనున్నాయి.

అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం
నేటి నుంచి ప్రారంభం కానున్న సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం చేశాం. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించాం. విద్యార్థులంతా నిర్ణీత సమయానికంటే ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.
– బండి వెంకటసుబ్బయ్య, ఆర్‌ఐఓ,ఇంటర్ విద్య



ఎర్ర స్మగ్లింగ్‌లో తగ్గేదేలే...

సోమశిలలో పుష్పరాజ్‌లు
- వెనుకజలాల చాటున యథేచ్ఛగా దుంగల అక్రమరవాణా
- చేపల వేట ముసుగులో తరలింపు
- స్థానిక అటవీ సిబ్బంది సహకారం పై అనుమానాలు

రాజంపేట: ఉభయ వైఎస్సార్ జిల్లాలో విస్తరించిన సోమశిల బ్యాక్‌వాటర్ 'పుష్పా'లకు అడ్డగా మారుతోందన్న ఆరోపణలు వెలువడుతున్నాయి. నందలూరు, ఒంటిమిట్ట మండలాల పరిధిలో ఉన్న సోమశిల బ్యాక్‌వాటర్‌లో ఎర్రచందనం స్మగ్లింగ్ యథేచ్ఛగా కొనసాగుతోంది. గతంలో అటవీశాఖ ప్రత్యేక దృష్టి సారించి ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసింది. గతంలో ఉన్నతాధికారులు దుంగలను పట్టుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి.ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు.గత కొంతకాలంగా స్మగ్లింగ్ మళ్లీ పడగవిప్పిందని ముంపుగ్రామాల్లో చర్చ మొదలైంది. ఆదిశగా అటవీశాఖ చర్యలు కనిపించడంలేదన్న విమర్శలు ఉన్నాయి.

జనసంచారంలేని ప్రాంతాలే టార్గెట్..

అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలు నరికి వాటిని జనసంచారం లేని ముంపు గ్రామాల శివార్లకు చేర్చి.. అక్కడి నుంచి అనుమానం రాకుండా అనుకున్న ప్రాంతాలకు తరలించేస్తున్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ వ్యవహారం గురించి ముంపుగ్రామాల్లో ఏ ఒక్కరిని కదిలించినా చెప్పేస్తారు. ఇప్పటికే ఈ స్మగ్లింగ్‌తో బ్యాక్‌వాటర్ సమీప గ్రామాలకు చెందిన కొందరు ఆర్థికంగా బాగా స్థిరపడ్డారన్న వాదన వినిపిస్తోంది. పల్లాగట్టు, గుండ్లమడ ప్రాంతాల పరిధిలోని అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను నరికి వాటిని నాటుబోట్లలో గట్టుకు చేర్చి అక్రమంగా మెయిన్‌రోడ్డుకు తరలిస్తున్నారు.



ఒంటిమిట్ట, నందలూరు వద్ద సోమశిల వెనుకజలాలు

చేపలవేట ముసుగులో...


చేపలవేట ముసుగులో ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతోందన్న అనుమానాలు ఉన్నాయి. ఐస్ బాక్స్‌లో పైన చేపలు, కింద భాగంలో ఎర్రచందనం దుంగలు అక్రమంగా రవాణా చేస్తున్నారు. బ్యాక్‌వాటర్‌లో చేపల వేట ముసుగులో ముంపు గ్రామాలకు సంబంధించిన ఇద్దరు ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తుండగా ఇటీవల ఇతర ప్రాంతంలో పట్టుకొని కేసులు కూడా నమోదు చేసినట్లు సమాచారం. ఎర్రచందనం స్మగ్లింగ్ చేయడం వల్ల ముంపుగ్రామాలకు చెందిన కొందరు తిరుపతి, రేణిగుంట తదితర ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసినట్లు, స్థానికంగా కూడా విలాసవంతమైన జీవితాలను గడుపుతున్నారని ఇక్కడి వారు చర్చించుకుంటున్నారు. ఈ విషయం అటవీశాఖ స్థానిక సిబ్బందికి తెలియకుండా ఉంటుందా అన్న భావనలు పుట్టుకొస్తున్నాయి.

» ఎండుచేపల తరలింపు మాటున..
సోమశిల బ్యాక్‌వాటర్ పరిసర ప్రాంతం నుంచి ఎండు చేపల మాటున ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్నారు. ఎండుచేపల వాసనతో వాహనాలను పెద్దగా తనిఖీ చేసే పరిస్థితులు ఉండవు. అదే స్మగ్లర్లకు కలిసివస్తోందని పలువురు పేర్కొంటున్నారు. అటవీశాఖ స్థానిక సిబ్బందికి ఈ వ్యవహారం తెలియకుండా ఉంటుందా అన్న సందేహాలు ముంపువాసుల్లో పుట్టుకొస్తున్నాయి.



» మచ్చుకొక సంఘటన..
గత వారంలో కొంతమంది యువకులు బ్యాక్‌వాటర్‌లోకి వెళ్లారు. ఈత కొడుతుండగా దుంగలు కనిపించాయి.ఇది ఆ నోటా..ఈ నోటా అటవీఅధికారులకు చేరింది. బ్యాక్‌వాటర్‌లో తనిఖీ చేసేందుకు వచ్చారు. పరిశీలించి, అవి దుంగలు కాదు.. రాళ్లు కొట్టుకువచ్చాయంటూ డైవర్షన్ చేశారు. అదే రోజున సిబ్బందికి నాటుకోడి, సారా విందు ఇచ్చారని ఆరోపణలు గుప్పుమన్నాయి. తర్వాత రెండురోజులకే బ్యాక్‌వాటర్‌లో ఉంచిన దుంగలను ఎవరికి అనుమానం రాకుండా తరలించేశారని ముంపుగ్రామాల్లో గుసగుసలు వినిపించాయి.

» చెక్‌పోస్టులు ఉన్నా...



కడప-రేణిగుంట జాతీయరహదారిలో రామాపురం(రాజంపేట) భాకరాపేట(సిద్ధవటం)లో, రైల్వేకోడూరు -రేణిగుంట మధ్యలో బాలపల్లెలో, నెల్లూరు రహదారిలో బెస్తపల్లె, అనుంపల్లె వద్ద చెక్‌పోస్టులు ఉన్నాయి. అయినా ఏ విధంగా ఎర్రచందనం దుంగలు అక్రమంగా దాటిపోతున్నాయో అంతుపట్టడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. సోమశిల బ్యాక్‌వాటర్ వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటుచే యాలని ముంపువాసులు కోరుతున్నారు. నందలూరు మండలంలో మదనమోహనపురం క్రాస్ ద్ద అటవీ చెక్‌పోస్టు పెడితే ఎర్రచందనం అక్రమరవాణాకు బ్రేక్ పడుతందని మండలవాసులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

గ్రామ పంచాయతీ ట్రాక్టర్ దగ్ధం



కాలిపోతున్న గ్రామ పంచాయతీ ట్రాక్టర్

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్న గ్రామ పంచాయతీకి చెందిన ఒక ట్రాక్టర్, రెండు చెత్త సేకరణ ట్రై సైకిళ్లు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని ఆదివారం మధ్యాహ్నం దగ్ధమయ్యాయి. చెత్త సేకరణకు వినియోగిస్తున్న ట్రాక్టర్ ఇటీవల మరమ్మతులకు గురికావడంతో పక్కన పెట్టామని, అందులోని డీజిల్ ఎండ వేడిమికి మంటలు చెలరేగాయని గ్రామ పంచాయతీ కార్యదర్శి రామమోహన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ టైర్లు, టాప్‌తోపాటు రెండు ట్రై సైకిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయని చెప్పారు. రూ.1.80లక్షలు ఆస్తి నష్టం కలిగినట్లు పేర్కొన్నారు.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి



మృతి చెందిన రామ చౌడప్ప

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని పి. బొమ్మేపల్లి గ్రామంలో ఇంటి ముందు పేడ నీళ్లు చల్లే విషయంలో శనివారం జరిగిన చిన్న పాటి గొడవలో గాయపడిన రామ చౌడప్ప (35) ఆదివారం మృతి చెందాడు. తలకు బలమైన గాయం కావడంతో బంధువులు ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడముతో కర్నూలుకు తీసుకెళ్లారు. డాక్టర్లు పరీక్షించి హైదరాబాదుకు తీసుకెళ్లాలని సూచించారు. ఆదివారం కర్నూలు నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో రామ చౌడప్ప మృతి చెందినట్లు సీఐ ఎస్. లింగప్ప తెలిపారు. మృతుడు బేల్దార్ పనులు చేసుకొని జీవించేవాడు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



సూర్యనారాయణరెడ్డి (ఫైల్)

కలసపాడు : మండలంలోని మామిళ్లపల్లె గ్రామానికి చెందిన సూర్యనారాయణరెడ్డి గత నెల 25వ తేదీ నుంచి కనిపించడం లేదని ఎస్ఐ తిమోతి తెలిపారు. 25వ తేదీ తన ఇంటి నుంచి వెళ్లిపోయాడని, ఇప్పటి వరకు తిరిగి రాలేదన్నారు. సదరు వ్యక్తి ఆచూకీ ఎవరికైనా తెలిసిన వెంటనే 9121100632 నంబరుకు సమాచారం అందించాలన్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్రాలగడ్డ ప్రాంతంలో ఆదివారం ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేస్తున్న మోచంపేటకు చెందిన సాదిక్‌వలీని ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 880 కిలోల రేషన్‌బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

బదిలీలకు వేళాయెె!

- ఉపాధ్యాయ బదిలీలకు రంగం సిద్ధం
- నేడు వెలువడనున్న నోటిఫికేషన్?
- బదిలీలపై గుర్రుగా ఉన్న ఉపాధ్యాయ సంఘాలు
- ఉమ్మడి జిల్లాలో 18 వందలమందికి పైగా అర్హులు



పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ బదిలీలకు పాఠశాల విద్యాశాఖ సన్నాహాలు చేపట్టింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ సోమవారం వెలవడనున్నట్లు తెలిసింది. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు, జీఓ 117 రద్దు మార్గదర్శకాల విడుదలకు సంబంధించి ఉపాధ్యాయ సంఘాలు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం, విద్యాశాఖ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంపై ఉపాధ్యాయ సంఘాలు గుర్రుగా ఉన్నాయి.

అంతా ఆన్‌లైన్ ప్రక్రియలోనే..

ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన దరఖాస్తు, స్థానాల ఎంపిక, కేటాయింపు ఇలా మొత్తం ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే జరగనుంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా ప్రాతిపదికన నిర్వహించే బదిలీలకు సంబంధించి సోమవారం నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. 2023 జూన్‌లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు చేపట్టింది. గతేడాది ఎన్నికల నేపథ్యంలో బదిలీల ప్రక్రియను చేపట్టలేదు, రెండేళ్ల తర్వాత తిరిగి నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి జూన్ 1 నుంచి మే 31వ తేదీ వరకు విద్యా సంవత్సరం ప్రాతిపదికన తీసుకోనున్నారు. ఇందులో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లకు కనీస సర్వీసు రెండు సంవత్సరాల నుంచి ఎనిమిదేళ్ల వరకు తీసుకోనున్నారు. గ్రేడ్-2 హెచ్‌ఎంలకు ఐదేళ్లుగా నిర్ణయించారు.

ఖాళీల వివరాలను డిస్‌ప్లేలో..

ఆయా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించి బదిలీ కోరుకునే ఉపాధ్యాయులకు డిస్‌ప్లే చేస్తారు. ఈ ఏడాది మే నెలాఖరు వరకు ఉన్న అన్ని ఖాళీలను బదిలీల్లో చూపుతారు. 2020 మే 31కు ముందు పాఠశాలల్లో చేరిన హెచ్‌ఎంలకు ఐదేళ్ల అదే పాఠశాలల్లో విద్యా సంవత్సరాలు పూర్తవుతున్నందున తప్పని సరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. అలాగే 2017 మే 31కి ముందు పాఠశాలల్లో చేరిన ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లకు ఎనిమిది సంవత్సరాలు పూర్తవుతున్నందున తప్పని సరిగా బదిలీ కావాలి. అయితే 2027 మే నెలాఖరులోపు ఉద్యోగ విరమణ చేసే ఉపాధ్యాయులకు బదిలీల నుంచి మినహాయింపు ఉండే అవకాశం ఉంది. ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా అన్ని క్యాడర్లకు సంబంధించి 9706 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో తప్పని సరి బదిలీలకు సంబంధించి 1800 మంది దాకా ఉండవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

జిల్లాలో ఉపాధ్యాయుల వివరాలు	
యాజమాన్యం	ఉపాధ్యాయుల సంఖ్య
ఎంపీపీ, జెడ్పీ	9016
ప్రభుత్వ	177
మున్సిపాలిటీ	513
మొత్తం	9706

చర్చలలో ఒక తీరు, నిర్ణయాలు మరో తీరు..



పాఠశాలల పునః వ్యవస్థీకరణ, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన విధి విధానాలపై ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపినప్పుడు ఒక తీరుగా, నిర్ణయాలను అమలు చేసేటప్పుడు మరో తీరుగా వ్యవహరిస్తోంది. జీఓ 117ను బేషరతుగా రద్దుచేసి, దాని స్థానంలోనే ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసి దాని ఆధారంగా మాత్రమే పాఠశాలలను పునః వ్యవస్థీకరించాల్సి ఉండగా అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. అన్ని ప్రాథమిక పాఠశాలలలో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలనే ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోలేదు. స్కూల్ అసిస్టెంట్‌ల స్థాయిని దిగజార్చి మోడల్ ప్రైమరీ స్కూళ్లకు హెడ్మాస్టర్‌గా నియమిస్తామనడం సరికాదు.

- మాదన విజయకుమార్, యూటీఎఫ్ వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి..



అధిక సంఖ్యలో ఉండే ఎస్‌జీటీ ఉపాధ్యాయులకైనా మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించాలి. బదిలీల ప్రక్రియకు ముందే ప్లస్-2 ఉన్నత పాఠశాలల్లో ఇంటర్మీడియట్ తరగతులు బోధించేందుకు అర్హులైన ఉపాధ్యాయులను నియమించాలి. ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించి అదనంగా పోస్టులను కేటాయించాలి. ప్రభుత్వం రూపొందించిన విధానాల వల్ల విద్యా రంగానికి తీవ్ర నష్టం జరుగుతుంది.

- రెడ్డెప్పరెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్, అధ్యక్షుడు అన్నమయ్య జిల్లా

ఉపాధ్యాయ సంఘాల సూచనలను పరిగణనలోనికి తీసుకోవాలి..



ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు, జీఓ 117 రద్దు మార్గదర్శకాల విడుదలకు సంబంధించి ఉపాధ్యాయ సంఘాలు చేసిన సూచనలను ఏమాత్రం పరిగణనలోనికి తీసుకోకుండా విద్యాశాఖాధికారులు ఏక పక్షంగా నిర్ణయాలు తీసుకొని అమలు చేయడం వల్ల ప్రభుత్వ విద్యారంగంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి గ్రామంలో 1 నుండి 5 తరగతులతో ప్రాథమిక పాఠశాలలను తప్పనిసరిగా కొనసాగించాలి. 1 నుండి 10 తరగతుల విధానాన్ని ఉపసంహరించుకోవాలి. ప్రాథమికోన్నత పాఠశాలలకు అన్ని రకాల సబ్జెక్టు టీచర్లను నియమించాలి. ఉన్నత పాఠశాలలలో 45 మంది విద్యార్థులు దాటితే రెండవ సెక్షన్ , 80 మంది దాటితే మూడవ సెక్షన్‌ను ఏర్పాటు చేయాలి.

- ఆదిరెడ్డి శ్యాసుందర్‌రెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

గ్యాస్ లీకేజీతో మంటలు

ఖాజీపేట : ఇంటిలోని గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణంగా మంటలు చెలరేగాయి. గృహం పూర్తిగా మంటల్లో చిక్కుకుని ఇంటిలోని విలువైన వస్తువులు కాలి బూడిదగా మారిన సంఘటన ఖాజీపేట మండలంలో జరిగింది. సర్వర్‌ఖాన్‌పేటకు చెందిన కమలాపురం గౌస్‌పీర్‌కు చెందిన గృహంలో గ్యాస్ లీకేజీ అయింది. అయితే ఆ సమయంలో ఇంటిలో ఎవ్వరూ లేక పోవడంతో, క్షణాల్లో మంటలు ఇళ్లంతా వ్యాపించాయి. ఇంటిలోని ఫ్రిడ్జ్, ఏసీతోపాటు విలువైన వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ.5లక్షల మేర ఆస్తి నష్టం జరిగి ఉంటుందని బాధితులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బందికి స్థానికులు సమాచారం అందించడంతో వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే తీరని నష్టం జరిగింది. కాగా గ్యాస్ సిలిండర్ పేలక పోవడంతో పెద్ద ప్రమాదం నుంచి బయట పడ్డాం అని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

నిమ్మనపల్లె : రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మదనపల్లి, కోళ్ల బైలు-2 పంచాయతీ, వైయస్సార్ కాలనీకి చెందిన ఎం.అశోక్ కుమార్ (21), స్నేహితుడు ప్రదీప్‌తో కలిసి ఏప్రిల్ నెల 29 న మండలంలోని నేలమల్లేశ్వర స్వామి ఆలయం వద్ద జరుగుతున్న వివాహానికి ద్విచక్ర వాహనంలో వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలోని ఎగువ మార్చిరెడ్డిగారిపల్లె రోడ్డు మలుపు వద్ద వాహనాన్ని అదుపు చేయలేక కిందపడి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు హుటాహుటిన బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బాధితులను తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ అశోక్ కుమార్ ఆదివారం మృతి చెందాడు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మిల్లర్ మీదపడి రోడ్డు నిర్మాణ కూలి మృతి



వసీంపై పడిన కాంక్రీట్ మిల్లర్

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గోపిరెడ్డిపల్లెకు సమీపంలో నెల్లూరు- బళ్లారి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న చోట ఆదివారం మిల్లర్ మీద పడి ఎండీ వసీం (23) అనే కూలి మృతి చెందాడు. గోపిరెడ్డిపల్లెకు సమీపంలోని శివపురం రహదారి వద్ద కాంక్రీట్ పనులు జరుగుతున్నాయి. ఆదివారం పనుల్లో భాగంగా మిల్లర్ నుంచి కాంక్రీట్ వేస్తున్న సమయంలో మిల్లర్ ఒరిగి పక్కనే ఉన్న వసీంపై పడింది. మిల్లర్ కింద పడిన ఆ యువకుడు నుజ్జు నుజ్జుగా మారి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు బీహార్‌లోని భాగల్పూర్ జిల్లాకు చెందిన వాడిగా తెలుస్తోంది. ఆష్రాఫ్, ఫైజర్ అనే వారు ఈ ప్రమాదం నుండి తప్పించుకున్నారు. మైదుకూరు అర్బన్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు దగ్ధం

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మంటపంపల్లి గ్రామ శివారులో ఉన్న వనమిత్ర వద్ద స్విఫ్ట్ డిజైర్ కారు దగ్ధమైంది. సీఐ బాబు తెలిపిన వివరాల మేరకు నంద్యాల పట్టణానికి చెందిన కార్తీక్, గీతాంజలి, శ్రీధర్ తదితరులు తిరుమలలో వివాహం చూసుకొని షిఫ్ట్ డిజైర్ కారులో తిరిగి వస్తుండగా మండల పరిధిలోని మంటపంపల్లి గ్రామ శివారులో ఉన్న వనమిత్ర వద్దకు రాగానే కారు టైరు పగిలి పక్కనే ఉన్న వంకలోకి దూసుకెళ్లి చెట్టును ఢీకొంది. దీంతో పెట్రోల్ పైప్ దెబ్బతిని కారులో మంటలు చెలరేగాయి. దీనిని ముందుగానే పసిగట్టిన కారులోని వారు కారు నుంచి బయటకు వచ్చేయడంతో పెను ప్రమాదం తప్పింది. కారు మొత్తం మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పే సమయానికి కారు మొత్తం దగ్ధం అయిపోయిందని సీఐ తెలిపారు.

మహిళలపై పోలీసుల వైఖరి సిగ్గుచేటు

రాజంపేట రూరల్ : మహిళల పట్ల పోలీసులు రౌడీలుగా వ్యవహరించటం సిగ్గుచేటని, మాజీ మంత్రి విడదల రజనిపై సీఐ సుబ్బనాయుడు తీరు దారుణమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏకుల రాజేశ్వరి మండిపడ్డారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో ఆదివారం వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు మిరియాల సురేఖ, జిల్లా కార్యదర్శి రక్కాసి శ్రీవాణీ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు చంద్రలీలతో కలిసి ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పోలీసుల ఎదుటనే దిశ చట్టానికి సంబంధించిన పేపర్లను తగలబెట్టడం బాధాకరమన్నారు. మాజీ మంత్రి విడదల రజని చేయి పట్టి లాగి పక్కకు నెట్టేసి దౌర్జన్యంగా పీఏ శ్రీకాంత్‌రెడ్డిని అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. నీరు గట్టు వారి పల్లెకు చెందిన శ్రీనివాసులు (35) చేనేత కార్మికుడిగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం కట్లాటపల్లె రోడ్డులో నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మాజీ మంత్రి విడదల రజనిపై పోలీసుల తీరు అమానుషం

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకటసుబ్బమ్మ

కడప కార్పొరేషన్ : మాజీ మంత్రి విడదల రజనిపై పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషమని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, కో ఆప్షన్ సభ్యురాలు బండి మరియలు, సునీత అన్నారు. శనివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయం ఎదుట నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజనిపై సీఐ సుబ్బానాయుడు ఆధ్వర్యంలో పోలీసులు దౌర్జన్యం చేయడం దారుణమన్నారు. నాదెండ్ల మండలంలోని ఓ గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పరామర్శించేందుకు వెళ్లిన ఆమెను పోలీసులు చుట్టుముట్టి దురుసుగా ప్రవర్తించారన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని వారు ప్రశ్నించారు. ఇటీవల కంతేరులో ఎస్సీ మహిళా ఎంపీటీసీని అరెస్ట్ చేశారని, దుస్తులు మార్చుకొని వస్తానన్నా వినిపించుకోకుండా, నైటీలోనే ఆమెను జీపులో ఎక్కించారన్నారు. వాళ్లేమైనా ఉగ్రవాదులా అంత అర్జెంటుగా అరెస్ట్ చేయాల్సిన అవసరమేమొచ్చిందని ప్రశ్నించారు. రెడ్ బుక్ రాజ్యాంగానికి ఈ రెండు ఘటనలు అద్దం పడుతున్నాయన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యయుతంగా పాలన సాగడం లేదని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు, మహిళలపై వేధింపులు, దౌర్జన్యాలు, దాడులే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీ తప్పా మరే పార్టీ ఉండకూడదన్న రీతిలో ప్రభుత్వ వైఖరి ఉందన్నారు. అరాచకాలు, అక్రమాలు, వేధింపులు కొనసాగిస్తున్న కూటమి నేతలు, సూపర్ సిక్స్ పథకాలు మాత్రం అమలు చేయడం లేదన్నారు. ఒక మాజీ మంత్రికే రక్షణ, భద్రత లేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని నిలదీశారు. సీఐ సుబ్బానాయుడు ఖాకీచొక్కా విప్పేసి పచ్చచొక్కా వేసుకోవాలని సూచించారు. రాజకీయ నాయకులకు తొత్తులుగా మారి అన్యాయంగా ప్రవర్తిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు మల్లీశ్వరి, పద్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

రైతుల కష్టం.. దొంగల పాలు!

- చీనీ తోటల్లో కాయలు అపహరిస్తున్న దుండగులు
- సుమారు 22 టన్నుల చీనీ కాయలు చోరీ
- రూ.6 లక్షలపైగా నష్టం
- లబోదిబో మంటున్న రైతులు



చీనీ తోటలో కాయలు కోసుకెళ్లారని చూపుతున్న రైతు

కొండాపురం : ఆరుగాలం కష్టపడి పండించిన రైతులను ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు దెబ్బ తీస్తుంటే.. మరోవైపు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితిలో చేతికంది వచ్చిన పంటను దొంగలు ఎత్తుకెళ్తుంటే వారి పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని లావనూరు గ్రామానికి చెందిన ఉమా మహేశ్వర్‌రెడ్డి తన బంధువుల పెళ్లి పనులు చూసుకుంటూ చీనీ తోట వద్దకు ఐదు రోజుల నుంచి వెళ్లలేదు. ఆరో రోజు చీనీ తోటలోకి వెళ్లి చూసేసరికి చీనీ చెట్లకు ఉన్న కాయలు లేవు. ఆరు ఎకరాల్లో పూర్తిగా 13 నుంచి 15 టన్నులు గుర్తు తెలియని వ్యక్తులు కోసుకెళ్లారు. ఈ ఘటనతో రైతు ఆందోళన చెందారు. అలాగే పక్కనే ఉన్న లక్ష్మిరెడ్డికి చెందిన ఆరు ఎకరాల్లో చీనీ తోట ఉంది. అందులో ఎకరాన్నర వరకు 5 టన్నులు, ఈశ్వర్‌రెడ్డి చీనీతోటలో చెట్లకు పైన పైన చీనీ కాయలను దుండగులు కోసుకుని పోయారు. మొత్తం 22 టన్నుల చీనీ కాయలను రాత్రివేళ ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ. 6 లక్షలు ఉంటుందని రైతులు తెలిపారు. పోలీసు అధికారులు వెంటనే స్పందించి దొంగలను పట్టుకొని న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

రాత్రి వేళ 30 గొర్లను ఎత్తుకెళ్లారు..

మండలంలోని కె.రామిరెడ్డిపల్లె గ్రామంలో ఓ ఇద్దరు గొర్ల యజమానులకు చెందిన 30 మూగజీవాలు (గొర్లు) గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో ఎత్తుకెళ్లారు. గ్రామ సమీపంలోని పెద్దమ్మ గుడి సమీపంలో ఓ రైతు పొలంలో కంచె వేసుకొని గొర్ల మంద తోలుకున్నారు. గొర్ల కాపర్లు పగలంతా గొర్లు మేపడానికి పొలాల్లో తిరిగి అలసిపోయి రాత్రి నిద్ర పోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు 30 గొర్లను ఎత్తుకెళ్లారు. ఆ మూగ జీవాల ధర రూ. 4 లక్షల పైగా ఉంటుందని గొర్ల కాపర్లు పేర్కొంటున్నారు. ఈ రెండు ఘటనలపై ఆయా పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు. పోలీసులు గట్టి నిఘా పెట్టి దొంగలను గుర్తించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

కమణీయం.. శ్రీ నారసింహుడి కల్యాణం



శ్రీ లక్ష్మీనరసింహుని కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



విశేషాలంకారంలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ



శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆదివారం శ్రీ నృసింహస్వామి జయంతి వేడుకలను పురస్కరించుకొని స్వామివారికి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిపారు. ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లి వేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి రాభిషేకం చేశారు. రంగురంగుల పుష్పాలతో స్వామివార్లను అలంకరించిన తీరు అందరిని ఆకట్టుకుంది. ముత్యాల తలంబ్రాలతో స్వామివారి పెళ్లి వేడుక నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారి ఎదుట యజ్ఞహోమాలు జరిపారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టు వస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గోపాల బట్టార్, కృష్ణరాజ బట్టార్, అనిల్‌స్వామి, గోకుల్‌స్వామి పాల్గొన్నారు.

ఘనంగా తరిగొండ వెంగమాంబ, నృసింహ జయంతి

మండలంలోని తరిగొండలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 255వ జయంతి, నృసింహస్వామి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రియ భక్తురాలైన ప్రముఖ రచయిత్రి వెంగమాంబ జన్మస్థలం తరిగొండ గ్రామం. ఇక్కడే శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయ ప్రాంగణంలోనే వెంగమాంబ ఆలయం ఉంది. వెంగమాంబ, నరసింహస్వామి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ఉదయం 6 గంటలకు స్వామివారి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం కావించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మహాస్నపనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంగమాంబ ఆలయాన్ని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. అమ్మవారికి పలు రకాల నైవేద్యాలను సమర్పించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళతాళాలతో పురవీధుల గుండా స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. టీటీడీకి చెందిన అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుల చేత మాతృశ్రీ వెంగమాంబ సంకీర్తన గోష్ఠిగానం, హరికథా కాలక్షేప కార్యక్రమాలు నిర్వహించారు. వెంగమాంబ, నృసింహ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు.

గుర్రంకొండలో..

మండల కేంద్రమైన గుర్రంకొండలో నృసింహస్వామి జయంతి వేడుకలు రెండేళ్ల తరువాత ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక చరిత్రాత్మక గుర్రంకొండ కోట పైభాగంలో ఉన్న శ్రీ నృసింహస్వామి ఆలయంలో స్వామివారి జయంతి ఉత్సవాలను జరిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు కిరణ్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు.

మిద్దె పైనుంచి పడి భవన నిర్మాణ కార్మికుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన సయ్యద్ సాబ్ వలి

మదనపల్లె రూరల్ : మిద్దె పైనుంచి పడి భవన నిర్మాణ కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని గౌతమీ నగర్‌కు చెందిన సయ్యద్ సాబ్ వలి(30) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం స్థానికంగా పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో అదుపుతప్పి మిద్దె పై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూముల కబ్జా

ఆక్రమణదారులకు కొమ్ముకాస్తున్న రెవెన్యూ అధికారులు



కొమ్మనవారిపల్లిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

పుల్లంపేట : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పుల్లంపేట అడ్డగా మారింది. పుల్లంపేట మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా పది గ్రామ పంచాయతీలలో ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమించుకొని రాత్రికి రాత్రే మొక్కలు నాటుకున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురి కాకుండా కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉన్నప్పటికీ వారు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఆక్రమణదారులకు రైల్వేకోడూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అండదండలు పుష్కలంగా ఉన్నాయని ప్రజలు బాహాటంగా చర్చించుకుంటున్నారు. పుల్లంపేట మండలంలోని కొమ్మనవారిపల్లి, దళవాయిపల్లి, రెడ్డిపల్లి, అనంతంపల్లి, రంగంపల్లి, బావికాడపల్లి, అనంతసముద్రం, వత్తలూరు, దేవసముద్రం , దొండ్లోపల్లి, గారాలమడుగు, తదితర గ్రామాలలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక వందలాది ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారు. గత ప్రభుత్వంలో ఎనిమిదవ విడత భూ పంపిణీలో భాగంగా పేదలకు పంచాల్సిన ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. కొమ్మనవారి పల్లి సర్వే నంబరు. 846లో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని మామిడి చెట్ల పెంపకం సాగిస్తున్నారు. అలాగే కొమ్మనవారిపల్లికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ పది ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.